క్లుప్తంగా

మలినేనిలో స్పేస్ ఎక్స్‌పో



ప్రత్తిపాడు: నేటి తరం యువత తమకున్న నైపుణ్యాలతో వినూత్న పరిశోధనలు చేయాలని మాజీ ఇస్రో శాస్త్రవేత్త చందు సాంబశివరావు అన్నారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని మలినేని ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం చంద్రయాన్–3 విజయోత్సవాన్ని పురస్కరించుకుని స్పేస్ ఎక్స్‌పోను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఇస్రో శాస్త్రవేత్త చందు సాంబశివరావు హాజరైన విద్యార్థులు ప్రదర్శించిన రకరకాల స్పేస్ ప్రాజెక్టులను పరిశీలించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ కేంద్రం స్పేస్ రంగంలో పరిశోధనలకు అత్యధిక ప్రాధాన్యాన్నిస్తుందన్నారు. విద్యార్థులకు తమకు నైపుణ్యం ఉన్న రంగాలను ఎంచుకుని, పరిశోధనలు చేయాలని కోరారు. కళాశాల చైర్మన్ మలినేని పెరుమాళ్లు మాట్లాడుతూ స్పేస్ ఎక్స్‌పో ప్రదర్శనల ద్వారా అంతరిక్షంలో జరిగే విషయాలను కళ్లకు కట్టినట్లు విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా వివరించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జె. అప్పారావు, డైరెక్టర్ దేవిరెడ్డి శ్రీనివాసకుమార్, ప్రొఫెసర్ జంపని కిషోర్, ఆయా విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

రెండు డీజే వాహనాలు సీజ్



పెదనందిపాడు: అనుమతి లేకుండా వినాయక నిమజ్జనం కార్యక్రమంలో ఉపయోగించిన రెండు డీజే వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. శనివారం మధ్యాహ్నం మండల పరిధిలోని నాగులపాడు, పాలపర్రు గ్రామాల్లో డీజే వాహనాలను, పలువురు డాన్సర్లను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలియజేశారు.

పత్తిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

గుంటూరు రూరల్: పత్తి పంటలో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని లాం ఫాం వ్యవసాయ పరిశోధన స్థానం పత్తి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.శ్రీలక్ష్మి తెలిపారు. శనివారం కొండెపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన పత్తిలో గులాబీ రంగు పురుగుల నివారణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పత్తి పంటల్లో ముందస్తుగా గులాబీ రంగు పురుగుల నివారణ చర్యలు పాటించాలని తెలిపారు. ఎకరానికి 8 లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల్లో అధికారులు, శాస్త్రవేత్తలు రైతులకు గులాబీ రంగు పురుగుల నివారణ కోసం ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో రైతులకు లింగాకర్షక బుట్టలను అందజేశారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఇంచార్జ్ శాస్త్రవేత్త డాక్టర్ జి దయానా, గ్రామ సర్పంచ్ రాంబాబు, వీఏఏ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

యువతలో సామాజిక స్పృహ అవసరం



ప్రత్తిపాడు: యువతలో సామాజిక స్పృహ ఎంతో అవసరమని కిట్స్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు అన్నారు. ఎన్ఎస్ఎస్ దినోత్సవం సందర్భంగా వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు గోరంట్ల టీచర్స్ కాలనీలోని వృద్ధాశ్రమం, అనాథ శరణాలయాల్లో ప్రత్యేక వితరణ కార్యక్రమాలను నిర్వహించారు. అనాథలు, వృద్ధుల ఆకలి బాధలు తీర్చేందుకు వంద కిలోల బియ్యంతో పాటు కందిపప్పు, వంటనూనె, రాగి పిండి, పండ్లు, డ్రై ఫ్రూట్స్‌లను షిర్డీసాయి ఆధ్యాత్మిక సేవా సమితికి అందించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కోయి శేఖర్, ప్రిన్సిపల్ డాక్టర్ కె. హరిబాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కె. చంద్రారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు ఆరుగురు శేకూరు విద్యార్థులు

శేకూరు(చేబ్రోలు): రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు చేబ్రోలు మండలం శేకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం కేఎస్ఎన్ ప్రసాద్, వ్యాయమ ఉపాధ్యాయుడు వీవీడీ కిషోర్‌లు శనివారం తెలిపారు. చేబ్రోలు మండలం నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ బాల బాలికల జట్లు ఎంపిక జరిగింది. గుంటూరు జిల్లా హ్యాండ్ బాల్ బాలుర, బాలికల జట్టులో శేకూరు జడ్పీ హైస్కూల్‌కు చెందిన జి లుధియా, టి లిఖిత, ఎం సాయి దుర్గ, టీ స్మ్యాలీ, బి రాజేశ్వరి, బి గోపయ్యస్వామిలు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 29వ తేదీ నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు తెనాలి ఏఎస్ఎన్ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో గుంటూరు జిల్లా జట్టు తరుపున పాల్గొంటారని పీడీ కిషోర్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల కమిటీ చైర్మన్ ఎం.గోపి, ఉపాధ్యాయులు అభినందించారు.

తలుపు తట్టి.. నాడి పట్టి



ప్రత్తిపాడులో జరుగుతున్న సర్వేలో భాగంగా ఇళ్లవద్దకు వెళ్లి వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యాధికారి డాక్టర్ దివ్య



ఈదులపాలెంలో బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి డాక్టర్ మేరియునిస్

- గ్రామాల్లో విస్తృతంగా 'జగనన్న ఆరోగ్య సురక్ష' సర్వే
- ఇంటి బాట పట్టిన వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది
- అక్కడికక్కడే రోగులకు ఏడు రకాల వైద్యపరీక్షలు

ప్రత్తిపాడు: అవ్వా ఆరోగ్యం ఎలా ఉంది. తాతా రోజూ షుగర్ మాత్రలు వేసుకుంటున్నావా. ఏంటి పెద్దాయన బీపీ కంట్రోల్‌లోనే ఉంటుందా.. ఉప్పు, కారాలు తగ్గించి ఆహారం తీసుకుంటున్నావా.. పెద్దమ్మ మన ఇంట్లో ఎవ్వరికైనా జలుబు, జ్వరాలు ఉన్నాయా.. అంటూ వైద్యాధికారులు ఇంటికెళ్లి ప్రజల ఆరోగ్య సమాచారాన్ని తెలుసుకుంటున్నారు. ప్రజారోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది ఇంటి బాట పట్టారు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి తలుపు తట్టి జనం నాడి పడుతూ 'జగనన్న ఆరోగ్య సురక్ష' సర్వేను విస్తృతంగా నిర్వహిస్తున్నారు.

ఒకే రోజు ఆరు గ్రామాల్లో..

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా శనివారం మండల పరిధిలోని పాతమల్లాయపాలెం, వంగిపురం, కోయవారిపాలెం, తిక్కిరెడ్డిపాలెం, ప్రత్తిపాడు–3, ప్రత్తిపాడు–1 ఆరు గ్రామాల్లో సర్వేను నిర్వహించారు. నేరుగా ప్రజల ఇళ్ల వద్దకే వెళ్లి వారి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలకు సంబంధించిన ఏడు రకాల పరీక్షలను అక్కడికక్కడే నిర్వహించి నిర్ధారణ చేస్తున్నారు. పద్దెనిమిది సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరికీ రక్తపోటు, మధుమేహం పరీక్షలు చేయడంతో పాటు పది సంవత్సరాల వయస్సు దాటిన వారందరికీ హిమోగ్లోబిన్ పరీక్షలు, రెండు వారాలకు మించి దగ్గుతో బాధపడుతున్న రోగులకు కళ్లె పరీక్ష, జ్వరాలతో బాధపడుతున్న వారికి డెంగీ, మలేరియా, పూర్తి యూరిన్ పరీక్షలు నిర్వహిస్తున్నారు.

సర్వే తీరుపై ఆకస్మిక తనిఖీలు..

గ్రామాల్లో జరుగుతున్న సర్వే తీరుపై వైద్యాధికారులు ఆకస్మిక తనిఖీలు చేస్తున్నారు. మండలంలోని తిక్కిరెడ్డిపాలెంలో జరుగుతున్న ఆరోగ్య సర్వేను గొట్టిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కెజియా గ్రేస్, ప్రత్తిపాడు–3లో జరుగుతున్న సర్వేను డాక్టర్ దివ్య మెహరాలు పరిశీలించారు. ఆరోగ్య సిబ్బందితో పాటు గృహాలకు వెళ్లి ప్రజలతో మాట్లాడారు. వారి ఆరోగ్య క్షేమ సమాచారాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య సిబ్బంది చేస్తున్న సర్వేను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ కెజియాగ్రేస్ మాట్లాడుతూ వచ్చే నెల 30వ తేదీ వరకు జరగనున్న ఆరోగ్య సురక్ష క్యాంపుల్లో రోగులకు మొత్తం పద్నాలుగు రకాల పరీక్షలు చేసి అక్కడికక్కడే మెరుగైన చికిత్సను అందిస్తామని చెప్పారు.

వైరల్ జ్వరాలతో జాగ్రత్త

వైరల్ జ్వరాల పట్ల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని గొట్టిపాడు పీహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ మేరియునిస్ అన్నారు. మండల పరిధిలోని ఈదులపాలెంలో శనివారం ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం నిర్వహించారు. 37 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం గర్భిణులు, బాలింతల ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని, చికిత్స చేసి మాత్రలు అందించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన అవసరం

జిల్లా జడ్జ్ పి.వి.రాంబాబు



న్యాయమూర్తి రాంబాబును సన్మానిస్తున్న కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖర్

గుంటూరు రూరల్: విద్యార్థి దశ నుంచి చట్టం గురించి తెలుసుకోవాలని అది అందరి బాధ్యతని జిల్లా జడ్జ్ పి.వి.రాంబాబు తెలిపారు. శనివారం నగర శివార్లలోగల లాం చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న న్యాయమూర్తి మాట్లాడుతూ ఏదైనా సమస్య వచ్చినపుడు ఆ సమస్యను పరిష్కరించటానికి న్యాయపరమైన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వ ప్రైవేటు ఆస్తులను ధ్వంసం చేయరాదని తెలిపారు. అదేవిధంగా ఖాళీ పత్రాలు, డాక్యుమెంట్స్‌పై సంతకాలు చేయరాదని తెలిపారు. న్యాయపరమైన సలహాలు తీసుకోవాలని చెప్పారు. ప్రముఖ న్యాయవాది కాళిదాసు మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడకుండా దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. చంద్రశేఖర్, జడ్జిని ఘనంగా సన్మానించారు. విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నిర్ణయించిన ధరలకే ఎరువులు విక్రయించాలి



ఎరువుల దుకాణంలో రిజిస్టర్‌లను పరిశీలిస్తున్న రామకోటేశ్వరి

కాకుమాను: ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు విక్రయించాలని నిబంధనలకు విరుద్ధంగా దుకాణ యజమానులు అధిక ధరలకు విక్రయిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పొన్నూరు ఏడీఏ రామకోటేశ్వరి అన్నారు. మండలంలోని పలు గ్రామాలలో శనివారం ఆమె ఎరువుల దుకాణాలను, ధరల వివరాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు సకాలంలో సక్రమంగా నాణ్యమైన ఎరువులను అందించాలనే ఉద్దేశంతో ఎరువులను అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే రైతులకు ఎరువులను అందించాలని ఆమె దుకాణ యజమానులను ఆదేశించారు. నిబంధలనకు విరుద్ధంగా ఎవరైన ప్రవర్తిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఎరువుల కొనుగోలు కోసం వచ్చే రైతులు తప్పనిసరిగా తమ ఆధార్ కార్డును తీసుకువచ్చి ఎరువులు కొనుగోలు చేసి రసీదు పొందాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా ఆయా దుకాణాలలో స్టాకు వివరాలు, ధరల వివరాలను పరిశీలించారు.ఆమె వెంట ఏఓ కె.కిరణ్మయి.సిబ్బంది ఉన్నారు.

వేజండ్లలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే



సర్వే తీరును పరిశీలిస్తున్న తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ, ఎంపీడీవో బి బాబురావు

వేజండ్ల(చేబ్రోలు): మండల పరిధిలోని వేజండ్లలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వేను మండల తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ, ఎంపీడీవో బి.బాబురావు శనివారం పరిశీలించారు. ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి అనారోగ్యం బారిన పడిన వారిని గుర్తించి వారికి ఈనెల 30వ తేదీన జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి రావాలంటూ టోకెన్లు అందిస్తున్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్నారు.

ఈ సందర్భంగా తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ, ఎంపీడీవో బి.బాబురావులు మాట్లాడుతూ వైద్య సిబ్బంది ప్రతిఇంటికి వెళ్లి ప్రతి ఒక్కరి ఆరోగ్య వివరాలను, నివేదకలను యాప్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. దీనిలో దీర్ఘకాలిక వ్యాధులు, నరాలకు సంబంధించిన వ్యాధులు, కంటికి సంబంధించిన వ్యాధుల గురించి పరీక్షలు చేసి 30వ తేదీన జరిగే మెగా మెడికల్ క్యాంపునకు వచ్చేలా స్లిప్పులు ఇవ్వాలని సూచించారు. వ్యాధులు ప్రబల గుండా పారిశుద్ధ్య పరిరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలను అధికారులు తెలియజేశారు. పంచాయతీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చేయి చేయి కలిపి..

- ప్రత్తిపాడులో అపర కర్మల నత్రం నిర్మాణం
- సహకరించిన దాతలు
- దశాబ్దాల సమస్యకు పరిష్కారం



ప్రత్తిపాడు చిన్నచెరువు కట్టపై నిర్మించిన హిందూ అపరకర్మల సత్రం

ప్రత్తిపాడు: ఎన్నో దశాబ్దాలుగా ప్రత్తిపాడు గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. గ్రామస్తులు చేయిచేయి కలిపి లక్షల రూపాయల వ్యయంతో చిన్న చెరువు కట్టపై హిందూ అపర కర్మల సత్రాన్ని నిర్మించారు. ప్రత్తిపాడులో హిందూ అపరకర్మల సత్రం లేకపోవడంతో కొన్ని దశాబ్దాలుగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ, బురదలో సైతం అపరకర్మలు నిర్వహించుకోవలసి దుస్థితి చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో ప్రత్తిపాడుకు చెందిన బాపతు శ్రీనివాసరెడ్డి, నరాల లక్ష్మీరెడ్డి, మామిళ్లపల్లి వీరాంజనేయులు ఆధ్వర్యంలో పదిహేను మంది దాతల నుండి రూ. 7 లక్షల రూపాయల విరాళాలను సేకరించారు. వాటితో స్థానిక చిన్నచెరువు కట్టపై భవనాన్ని నిర్మించారు. ఈ భవనాన్ని ఆదివారం ఉదయం ప్రారంభించనున్నట్లు ఆర్గనైజర్లు తెలిపారు. గ్రామం ఏర్పడిన నుంచి అపరకర్మల సత్రం లేక గ్రామస్తులు ఎన్నో ఇబ్బందులు పడ్డారని, ఆ సమస్యను తొలగించేందుకే దాతల సహకారంతో సత్రం నిర్మాణానికి పూనుకున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు పొన్నూరులో పేద విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ

కొరిటెపాడు(గుంటూరు): కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలైజ్డ్ ట్రస్ట్, కాపు సేవా సమితి పొన్నూరు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో పొన్నూరులోని సాయి దివ్య ఫంక్షన్ హాలులో ఆదివారం పేద విద్యార్థులకు రూ.4 లక్షల ఉపకార వేతనాల్ని పంపిణీ చేయనున్నట్లు తులసి సంస్థల అధినేత తులసి రామచంద్ర ప్రభు తెలిపారు. కాపు సేవా సమితి పొన్నూరు శాఖ సభ్యులు శనివారం అరండల్‌పేట 3వ లైనులోని తులసి భవన్‌లో ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిశారు. పొన్నూరులో ఆదివారం జరగనున్న విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీకి ముఖ్య అతిథిగా రావాలని రామచంద్ర ప్రభును ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలైజ్డ్ ట్రస్ట్ తులసి రామచంద్ర ప్రభు రూ.2 లక్షలు, కాపు సేవా సమితి పొన్నూరు శాఖ రూ.2 లక్షలు కలిపి మొత్తం రూ.4 లక్షల్ని 120 మంది విద్యార్థులకు అందజేయనున్నారు.

చిన్నారులకు దుస్తులు పంపిణీ

వల్లూరు(కాకుమాను): గ్రామాలలో ఉన్న అనాథ పిల్లలను ఆదుకోవడమే ఆదరణ కర్త షారోన్ చారిటబుల్ ట్రస్టు ముఖ్య ఉద్దేశమని ఆ ట్రస్టు సభ్యులు పాస్టర్ బి.జోషఫ్ అన్నారు. మండలంలోని వల్లూరులో ఉన్న ఆదరణ కర్త షారోను ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం యాహూ సాఫ్టువేర్ డెవలప్‌మెంట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వారి సహకారంతో అనాథ పిల్లలకు నూతన వస్త్రాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో దైవసేవకురాలు బి.రిబ్కా, అడిపి జాషువ, వెంకటరెడ్డి, రోషన్, సుబ్బారెడ్డి, విశ్వాసులు పాల్గొన్నారు.

రోగి భావాలను అర్థం చేసుకోవడమే ఫార్మాకో ముఖ్య ఉద్దేశం

చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాదెండ్ల రామారావు

గుంటూరు రూరల్: రోగి ప్రతికూల ప్రభావాలు గుర్తించటం, అంచనావేయటం, అర్థం చేసుకోవటం, నివారించటం ఫార్మాకో విజిలెన్స్ ముఖ్య ఉద్దేశాలని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. శనివారం జాతీయ ఫార్మాకో విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా కళాశాల ఐపీసీ పీవీపీఐ కళాశాల ఏడీఆర్ మానిటరింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ పోటీలను విద్యార్థులకు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ జాతీయస్థాయి పోటీలలో 8 కళాశాలల నుంచి 60 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. అదేవిధంగా ప్రభుత్వ సర్వజనాసుపత్రి నుంచి మార్కెట్ సెంటర్ వరకూ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ వై.కిరణ్‌కుమార్ అధ్యక్షతన ర్యాలీని నిర్వహించారన్నారు. కార్యక్రమంలో డి.వరలక్ష్మి, చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు

గుంటూరు పోస్కో కోర్ట్ స్పెషల్ పబ్లిక్ ప్రోసిక్యూటర్ కారుమంచి శ్యామల



చేబ్రోలు: బాలల హక్కులకు భంగం కల్పిస్తే చర్యలు తప్పవని గుంటూరు పోస్కో కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రోసిక్యూటర్ కారుమంచి శ్యామల అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో కేర్ అండ్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ సమస్యలు – సవాళ్లు అనే అంశంపై అంతర్జాతీయ స్థాయి కాన్ఫరెన్స్ శనివారం జరిగింది. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కారుమంచి శ్యామల మాట్లాడుతూ బాలల హక్కులైన విద్యాహక్కు చట్టం, జీవించే హక్కు గురించి బాలలకు ఉండే ఇతర చట్టాల గురించి, పోలీసులు బాలలకు కల్పించే రక్షణ, మంచి స్పర్శ, చెడు స్పర్శ గురించి, ఫోక్సో చట్టం గురించి, చట్టంతో విబేధించిన బాలురకు ప్రత్యేక బాలల కోర్టులు, రక్షణ కేంద్రం గురించి విద్యార్థులకు వివరించారు. గుంటూరులోని జువెనైల్ జస్టిస్ డిపార్ట్‌మెంట్ లీగల్ కం ప్రొబేషన్ ఆఫీసర్ వాసంతి మాట్లాడుతూ లైంగిక వేధింపులు, బాల కార్మికులు, మానవ అక్రమ రవాణా వంటి వివిధ మార్గాల్లో పిల్లలు సులభంగా దోపిడీకి గురవుతారని తెలిపారు. వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

మేలైన విస్తరణ సేవలు అందించాలి

జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న నున్న వెంకటేశ్వర్లు

గుంటూరు రూరల్: రైతులకు మేలైన విస్తరణ సేవలు అందించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం నగరంలోని వ్యవసాయశాఖ కార్యాలయం నందున్న కృషి భవన్‌లో ఏర్పాటు చేసిన గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలోని ఎంపిక చేసిన 40 మంది ఎరువులు, పురుగు మందులు డీలర్లకు వ్యవసాయ విస్తరణ సేవల డిప్లమో కోర్సు శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.రామాంజనేయులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లావ్యవసాయ శాఖ అధికారి మాట్లాడుతూ రైతులకు డీలర్లు మేలైన ఎరువులు, పురుగు మందులు అందిస్తూ రైతుల అభివృద్ధికి సహకరించాలన్నారు. పల్నాడు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఐ మురళి మాట్లాడుతూ డీలర్లు రైతులకు అవరాన్ని బట్టి సరైన నాణ్యమైన వ్యవసాయ వనరులు, ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అందజేయాలని సూచించారు. ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ పీ రామాంజనేయులు మాట్లాడుతూ ఈ కోర్సు ఒక సంవత్సరం పాటు ప్రతి ఆదివారం క్లాసులు నిర్వహిస్తారన్నారు. శాస్త్రవేత్తలు ఉన్నతాదికారులు, శాస్త్రవేత్తలు డీలర్లకు అవసరమైన శిక్షణ అందిస్తారన్నారు. కార్యక్రమం సమన్వయకర్త టి.వెంకటేశ్వర్లు, కె.వేణుకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జొన్నలగడ్డలో స్వచ్ఛతే సేవ



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సీబీసీ గుంటూరు పీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ రమేష్‌చంద్ర

గుంటూరు రూరల్: సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) గుంటూరు ఫీల్డ్ ఆఫీస్ ఆధ్వర్యంలో స్వచ్ఛతే సేవ–2023 పై వివిధ కార్యక్రమాలు నిర్వహించటం జరుగుతుందని సీబీసీ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ ఆర్.రమేష్‌చంద్ర తెలిపారు. శనివారం మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీన మహాత్మా గాంధీ 154వ జయంతి వరకు స్వచ్ఛతే సేవ కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమాల్లో భాగంగా ఈ ఏడాది చెత్త రహిత భారత్ నిర్మాణంపై వివిధ అవగాహన, క్విజ్ స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. సంపూర్ణ స్వాతంత్ర్యంతో పాటు గాంధీజీ ఆశించిన స్వచ్ఛ భారత్ నిర్మాణంలో ప్రజలు, భావి పౌరులు విద్యార్థుల భాగస్వామ్య అవసరాన్ని ఆయన వివరించారు. స్వచ్ఛత ఇంటి నుంచి ప్రారంభమై పని స్థానం వరకు కొనసాగుతుందని, చెత్తను తడి, పొడి ఇతర వ్యర్థాలను తగిన విధంగా విభజించి సూచించిన విధంగా పారవేయాలని తెలిపారు. పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతని చెప్పారు. స్వచ్ఛతే సేవలో భాగంగా గుంటూరులోని లోర్డేస్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన క్విజ్ కార్యక్రమ విజేతలకు సీబీసీ అధికారులు బహుమతులు అందజేశారు. పాఠశాలలో స్వచ్ఛత అభియాన్‌లో భాగంగా విద్యార్థులు పారిశుద్ధ్య కార్యక్రమాల్లో పాల్గొన్నారు. విద్యార్థులు వారానికి రెండు గంటలు స్వచ్ఛత కార్యక్రమాలలో పాల్గొంటామని స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎం.శిరీష, ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయుడు జేసస్, లోర్డేస్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.బాలశౌరి, ఉపాధ్యాయులు బాలరాజు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో గ్రామసంఘాలు కీలకం

సెర్ప్ డైరెక్టర్ శ్రీనివాసులు



సమావేశంలో మాట్లాడుతున్న సెర్ప్ డైరెక్టర్ శ్రీనివాసులు

తిక్కిరెడ్డిపాలెం (ప్రత్తిపాడు): గ్రామాల అభివృద్ధిలోనూ గ్రామ సంఘాల పాత్ర ఎంతో కీలకంగా ఉండాలని సెర్ప్ డైరెక్టర్ శ్రీనివాసులు అన్నారు. జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ప్రత్తిపాడు మండలం తిక్కిరెడ్డిపాలెంలో శనివారం సెర్ప్, యూనిసెఫ్, ఆర్‌డబ్ల్యూఎస్ సంయుక్త ఆధ్వర్యంలో 'నీరు–పారిశుధ్యం' కార్యక్రమంలో గ్రామ సంఘాల పాత్రపై గ్రామ సంఘాల ఓబీలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత గ్రామంలో తాగు నీటి సరఫరా ఎలా ఉంది, ఎన్ని రోజులకోసారి నీటిని సరఫరా చేస్తున్నారు, క్లోరినేషన్ చేస్తున్నారా, సరిపడినన్ని నీటిని అందిస్తున్నారా? లేదా వంటి విషయాలను సంఘ సభ్యులను, గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన సెర్ప్ డైరెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఓడీఎఫ్ ప్లస్‌లో భాగంగా ప్రతి వ్యక్తికి రోజుకు కనీసం మంచినీరు అందించాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగు పరిచేందుకు గ్రామ సంఘాల సభ్యులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మన గ్రామం స్వచ్ఛంగా ఉంటే ఊరంతా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. గ్రామాల్లో గ్రామ పారిశుద్ధ్య కమిటీలను బలోపేతం చేసుకుంటూ పారిశుద్ధ్య నిర్వహణలో అగ్రగామిగా నిలవాలని సూచించారు. ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కామేశ్వరి మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు సమన్వయంతో ముందుకు వెళ్లినప్పుడే సంపూర్ణ పారిశుద్ధ్యం అమలు సాధ్యపడుతుందన్నారు. యూనిసెఫ్ ప్రతినిధి వెంకటేష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు సురక్షిత తాగునీటిని అందించేందుకు ప్రభుత్వాలు జలజీవన్ మిషన్ ద్వారా కోట్లాది రూపాయలను వెచ్చిస్తున్నాయన్నారు. వాటర్ ట్యాంకులు, పైపులైన్లు, కుళాయి కనెక్షన్లు, మైక్రోవాటర్ ఫిల్టర్‌లు.. ఇలా అనేక రకాల తాగు నీటి వసతులను గ్రామాల్లో జేజేఎం ద్వారా సమకూర్చుతున్నాయని వివరించారు. వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం సురేష్‌కుమార్ మాట్లాడుతూ గ్రామ సంఘాలు గ్రామాల్లో యాక్టివ్ రోల్ పోషించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జగన్‌మోహన్‌రావు, వీవో సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక చవితి ఉత్సవాలు



పొత్తూరులో నిమజ్జన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్యామల వెంకటరమణాదేవి బ్రహ్మారెడ్డి

గుంటూరు రూరల్: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో చవితి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. శనివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజల్లో రూరల్ మండలం జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన మహాన్నదాన కార్యక్రమంను ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామంలోని సమీప గ్రామాలకు చెందిన సుమారు 10 వేల మంది భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వంగా నవీన్ రెడ్డి, గ్రామంలోని ప్రజలు బక్తులు పాల్గొన్నారు.

పొత్తూరు గ్రామంలో...

పొత్తూరు గ్రామంలోని చెరువుకట్టపై ఏర్పాటు చేసిన వినాయ చవితి ఉత్సవాలు స్థానిక ప్రజలు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. శనివారం ఉత్సవాల్లో భాగంగా నిమజ్జనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ శ్యామల వెంకట రమణాదేవి, బ్రహ్మారెడ్డిలు ప్రత్యేక పూజలు చేసి నిమజ్జనోత్సవాలను ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామంలోని భక్తులు పాల్గొన్నారు.

పెదకాకానిలో...

పెదకాకాని: ఆదిదేవుడు వినాయకునికి భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తున్నారు. వినాయక చవితి ఉత్సవాల్లో బాగంగా పూజలందుకున్న గణనాధులు గ్రామోత్సవము ముగించుకుని నిమజ్జనానికి తరలి వెళుతున్నాడు. మండలంలో గత ఐదు రోజులుగా పందిళ్ళలో పూజలందుకుంటున్న గణనాధులను శనివారం ట్రాక్టర్‌పై అలంకరించి గ్రామోత్సవం చేశారు. అనంతరం నిమజ్జనానికి తరలి వెళ్లారు. పెదకాకాని మండలంలోని నంబూరులో హంస వాహనంపై ఉన్న వినాయకుడిని ట్రాక్టర్‌పై అలంకరించి మేళతాళాలు, కనకతప్పెట్ల, డీజే మోతల నడుమ ఘనంగా గ్రామోత్సవము నిర్వహించారు. గణేష్ మహరాజ్‌కీ జై అంటూ భక్తుల జయజయధ్వానాల నడుమ సమీపంలోని పాతకాలువలో నిమజ్జనం చేశారు. గొర్రె పాటేళ్ళ బండిపై నిమజ్జనానికి తరలి వెళుతున్న వినాయకుడు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు.